

సమావేశంలో మాట్లాడుతున్న గజ్జల కాంతం

ఉద్యమకారులను గుర్తించాలి : వక్తలు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): కేసుల నమోదుతో సంబంధం లేకుండా తెలంగాణ ఉద్యమకారులను ప్రభుత్వం గుర్తించి ప్రయోజనాలు కల్పించాలని వక్తలు డిమాండ్ చేశారు. దివ్యాంగులు, మహిళలు ఉద్యమంలో పాల్గొన్నా.. కేసులు నమోదు కాలేదని, కొందరు మారు పేర్లు చెప్పడంతో అసలు పేర్లపై కేసులు నమోదైన వివరాలు లేవన్నారు. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకొని అసలైన ఉద్యమకారులకు తగిన గుర్తింపునివ్వాలన్నారు. తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనం లక్డీకాపూల్‌లోని ఓ హోటల్‌లో శనివారం జరిగింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేత కత్తి వెంకటస్వామి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారుల హక్కుల సాధనకు కమిటీ వేసి పార్టీలకతీతంగా పోరాడాలన్నారు. ప్రజాసంఘాల జేఏసీ చైర్మన్ గజ్జల కాంతం మాట్లాడుతూ తెలంగాణ ద్రోహులకు పదవులు కట్టబెట్టిన మాజీ సీఎం కేసీఆర్ ఉద్యమ ద్రోహి అయ్యారన్నారు. కేసీఆర్ జన్మలో మళ్లీ అధికారంలోకి రాకుండా చూడాల్సిన బాధ్యత మనపై ఉందని పిడమర్తి రవి అన్నారు. 250 గజాల భూమి, రూ.25 వేల పెన్షన్ ప్రకటనపై సీఎం రేవంత్‌కు ధన్యవాదాలు తెలుపుతూ.. ఇది ఉద్యమకారులకు దక్కిన తొలి గుర్తింపు అన్నారు. కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు, ఉస్మానియా, కాకతీయ యూనివర్సిటీల విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

కాళ్లు పట్టుకునే అవసరం మాదిగ జాతికి లేదు

● టీఎస్ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్

రాంనగర్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఎవరి కాళ్లు పట్టుకునే అవసరం మాదిగజాతికి లేదని, మాదిగల హక్కుల కోసం ఎంతకైనా పోరాటం చేస్తామని టీఎస్ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ అన్నారు. శనివారం విద్యానగర్‌లోని ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మందకృష్ణమాదిగ జాతిని ఆత్మగౌరవం నుంచి బానిసత్వం వైపు నడపాలని అనుకుంటున్నారని ఆరోపించారు. మందకృష్ణమాదిగను నడిపిస్తున్న మనువాద బీజేపీకి తెలంగాణలో ఆస్కారమే లేదన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మాదిగ జాతి బీజేపీకి ఓటు ద్వారా బుద్ధిచెబుతుందని ఆయన హెచ్చరించారు.

జేఎన్‌టీయూలో అఫిలియేషన్ దందా..!

● ఇంజనీరింగ్ కళాశాలల గుర్తింపు దరఖాస్తుకు నేటితో ఆఖరు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ అధికారులు ఈ ఏడాది త్వరగా అఫిలియేషన్ తీసుకోవాలంటూ తమను ఎందుకు తొందర పెడుతున్నారో అర్థం కావడం లేదని ప్రైవేటు కళాశాలల యాజమాన్య ప్రతినిధులు వాపోతున్నారు. ఎన్‌వోసీలకు ఇచ్చిన గడువును 10 రోజుల ముందుకు ప్రీపోన్‌మెంట్ చేయడం, ఆదివారంలోగా అఫిలియేషన్‌కు దరఖాస్తు చేసుకోకుంటే భారీగా జరిమానా విధిస్తామనడం పట్ల తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. పైఅధికారులను సంతృప్తిపరచడం కోసమని అఫిలియేషన్ దందాలకు తెరతీయడం సమంజసంగా లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆలస్యమైతే 100 శాతం ఫీజును జరిమానా అదనంగా చెల్లించాలంటూ.. ఈ నెల 12న యూనివర్సిటీ రిజిస్ట్రార్ పేరిట విడుదల చేయడం దారుణమని పేర్కొన్నారు. జరిమానాల పేరిట ప్రైవేట్ కళాశాలలపై జేఎన్‌టీయూ భారం మోపితే.. ఆ భారం అటూ ఇటూ తిరిగి ఆయా కాలేజీల్లో చేరే విద్యార్థులపైనే పడుతుందని తల్లిదండ్రులు వాపోతున్నారు. కాగా, అఫిలియేషన్ ప్రక్రియ ఆలస్యం కాకూడదనే ఈ ఏడాది త్వరగా ప్రారంభించామని వీసీ డాక్టర్ కట్టా నర్సింహారెడ్డి తెలిపారు.

27 నుంచే ఎఫ్ఎఫ్‌సీ తనిఖీలు..

ఈ నెల 27 నుంచే ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీల్లో నిజనిర్ధారణ చేస్తామని, మార్చి 20లోగా ఆ ప్రక్రియ పూర్తి చేస్తామని రిజిస్ట్రార్ జారీ చేసిన సర్క్యులర్‌లో ప్రస్తావించారు. వాస్తవానికి గతేడాది ప్రైవేట్ కళాశాలల్లో ఎఫ్ఎఫ్‌సీ తనిఖీలను ఏప్రిల్ 20 నుంచి నిర్వహించారు. ఈ ఏడాది రెండు నెలలు ముందుగా చేపట్టడానికి కారణాలేమై ఉంటాయా అని పలువురు చర్చించుకుంటున్నారు.



డ్రోన్ షోలో సీఎంఆర్ సంస్థ సభ్యులు, మోడళ్లు



డ్రోన్ షోలోని దృశ్యం

కైతలాపూర్ గ్రౌండ్‌లో డ్రోన్ విన్యాసాలు

అల్లాపూర్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): సీఎంఆర్ ఫ్యామిలీ మాల్ ఆధ్వర్యంలో కూకట్‌పల్లి కైతలాపూర్ గ్రౌండ్‌లో మెగా డ్రోన్ షోను శనివారం నిర్వహించారు. ఈ షోలో సీఎంఆర్ సంస్థకు సంబంధించిన విశేషాలను, తాము అందిస్తున్న విభిన్న రకాల ఉత్పత్తులు, ప్రత్యేకతలను వివరించారు. నగధగలు.. మోడల్స్ హొయలు మరోవైపు సీఎంఆర్ లెగసీ ఆఫ్ జ్యుయలరీ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్లామ్ వాక్ కూడా కళ్లు జిగేల్ మనిపించింది. బిగ్‌బాస్ ఫేం జెస్సీ సారథ్యంలో జరిగిన ఈ ర్యాంప్ వాక్‌లో అందమైన మోడల్స్ ఆభరణాలను మేనిపై మెరిపిస్తూ జ్యుయలరీ ప్రియులను ఆకట్టుకున్నారు. ఎండీ సత్యనారాయణ మాట్లాడుతూ నగరవాసులకు వైవిధ్య భరిత అనుభూతి అందించాలని ఈషో నిర్వహించామన్నారు.

అశ్లీల ఫొటోలు, వీడియోలతో బ్లాక్‌మెయిల్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): పార్ట్‌టైం ఉద్యోగాల పేరుతో బాలికలను ట్రాప్‌చేసి అశ్లీల ఫొటోలు, వీడియోలతో బ్లాక్‌మెయిల్ చేస్తున్న సైబర్ నేరగాడి ఆటకట్టించారు సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు. జాయింట్ సీపీ తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తగూడెంకు చెందిన నిందితుడు ఆర్టిస్ట్ - విజయ్ - కుమార్ - 11005 పేరుతో నకిలీ ఇన్‌స్టాగ్రామ్ ఖాతా సృష్టించాడు. పార్ట్‌టైం జాబ్స్ ఫర్ గర్ల్స్ పేరుతో స్టేటస్‌లు పెట్టేవాడు. అతన్ని సంప్రదించిన వారికి ఫ్రెండ్ రిక్వెస్టులు పంపి, ఫ్రెండ్స్‌గా మార్చుకొని రోజూ చాటింగ్ చేసేవాడు. తన మాయమాటలతో న్యూడ్ ఫొటోలు, న్యూడ్ వీడియోలు తీసుకునేవాడు. ఆ తర్వాత వాటిని అడ్డం పెట్టుకొని బ్లాక్‌మెయిల్ చేసేవాడు. బాధితుల ఫిర్యాదు మేరకు సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ సైదులు బృందం టెక్నికల్ ఎవిడెన్స్ సేకరించి సైబర్ నేరగాడిని అరెస్టు చేసి కటకటాల్లోకి నెట్టారు.

వండర్స్ ఆఫ్ ద వైల్డ్ ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ పోటీ

హైదరాబాద్‌సిటీ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): వైల్డ్ లైఫ్ ఫొటోగ్రఫీ ప్రియుల కోసం నికాన్ ఇండియా సంస్థ తొలిసారిగా వండర్స్ ఆఫ్ వైల్డ్ ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ పోటీని వరల్డ్‌వైడ్ ఫండ్ ఫర్ నేచర్- ఇండియాతో కలిసి నిర్వహిస్తోంది. మార్చి 3 వరకు జరుగుతుంది. విజేతలకు నికాన్ జెడ్ సిరీస్ కెమెరాలు బహుమతిగా అందజేస్తారు. టాప్ 10లో నిలిచిన వారికి డబ్ల్యూడబ్ల్యూఎఫ్ ఇండియా నేచర్ స్టోర్ మర్చండైజ్‌ను అందించనున్నారు. ఆసక్తి గల వారు నికాన్ ఇండియా వెబ్‌సైట్ (https://capturewithnikon.in/wondersofthewild)లో, ఇన్‌స్టాగ్రామ్ @NikonIndiaOfficialలో కూడా దరఖాస్తులు సమర్పించవచ్చు.

నేడు సనత్‌నగర్‌లో అగ్నిమాపకశాఖ ప్రధాన కార్యాలయం ప్రారంభం

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): సనత్‌నగర్‌లో క్రెడాయ్ సహకారంతో రూ. 17 కోట్లతో నిర్మితమైన అగ్నిమాపక శాఖ ప్రధాన కార్యాలయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదివారం వర్చువల్‌గా ప్రారంభిస్తారని అగ్నిమాపక శాఖ అధికారులు తెలిపారు. 29,653 చదరపు అడుగుల విస్తీర్ణంలో నాలుగు అంతస్తుల్లో అత్యాధునిక హంగులతో భవనాన్ని నిర్మించారు. సెల్లార్‌లో పార్కింగ్, గ్రౌండ్, మొదటి అంతస్తులో అగ్నిమాపక కేంద్రాలు, రెండో అంతస్తులో కమాండ్ కంట్రోల్ సెంటర్, ప్రాంతీయ అగ్నిమాపక అధికారి కార్యాలయం, డీజీ, అడిషనల్ డైరెక్టర్స్ కార్యాలయం, నాలుగో అంతస్తులో డైరెక్టర్ జనరల్, బోర్డు రూమ్ ఏర్పాటు చేశారు.

త్రోబాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా నవీన్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): తెలంగాణ త్రోబాల్ సంఘం నూతన అధ్యక్షుడిగా వి.నవీన్ యాదవ్ ఎన్నికయ్యారు. శనివారం యూసుఫ్‌గూడలో జరిగిన సంఘం సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నవీన్, ప్రధాన కార్యదర్శిగా కిరణ్, కోశాధికారిగా వెంకట్ బాధ్యతలు స్వీకరించారు. శాట్స్ నుంచి అలెగ్జాండర్ ఫ్రాన్సిస్, జాతీయ త్రోబాల్ సంఘం నుంచి మధు ఎన్నికల పరిశీలకులుగా హాజరయ్యారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

ముషీరాబాద్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మానవత దృక్పథంతో కార్పొరేట్ వైద్య సంస్థలు పేదప్రజలు నివసించే ప్రాంతాలలో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ కోరారు. శనివారం ముషీరాబాద్ డివిజన్ మోహన్‌నగర్ కమ్యూనిటీహాల్‌లో కామినేని ఆస్పత్రి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు డి.శివముదిరాజ్, ముషీరాబాద్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు కొండా శ్రీధర్‌రెడ్డిల ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో కంటి, దంత, గుండె, పీబీ, షుగర్, ఈసీజీ తదితర పరీక్షలను 350 మందికి చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. లాభాపేక్షతోకాకుండా ప్రైవేటు వైద్య సంస్థలు ప్రజలకు వైద్యసేవలు అందించేందుకు స్వచ్ఛందంగా ముందుకు రావాలి అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యువజన కమిటీ గ్రేటర్ హైదరాబాద్ సీనియర్ నాయకుడు ముఠా జైసింహ, ముషీరాబాద్ డివిజన్ బీఆర్ఎస్ ప్రధానకార్యదర్శి ఆకుల అరుణ్ కుమార్, కార్డియాలజిస్ట్ డాక్టర్ నీరజ మోహిత్, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ ఫైజాక్, జనరల్ సర్జన్ డాక్టర్ సుకుమార్, ఆర్థోపెడిక్ డాక్టర్ ప్రేమ్‌కుమార్, డాక్టర్ తబసోం, నస్రీన్, కామినేని ఆస్పత్రి ప్రతినిధి ఆనంద్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



పైప్‌లైన్‌పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, పావనివినయ్‌కుమార్

కలుషితనీటి సరఫరా సమస్య పరిష్కారానికి చర్యలు

చిక్కడపల్లి: ముషీరాబాద్ నియోజకవర్గంలో కలుషిత నీటి సరఫరా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే ముఠా గోపాల్, గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ అన్నారు. శనివారం గాంధీనగర్ డివిజన్ జగదాంబ నర్సింగ్ హోమ్ నుంచి విక్టోరియా కేఫ్ వరకు రూ.20.75 లక్షల అంచనావ్యయంతో నిర్మించనున్న మంచినీటి పైప్‌లైన్ పనులను వారు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు వినయ్‌కుమార్, రత్న సాయిచంద్, శ్రీకాంత్, వీఎస్టీ రాజు, ఆనంద్, జైసింహ, రాకేష్‌కుమార్, శ్రీకాంత్, పున్న సత్యనారాయణ, బత్తుల కిరణ్, వాటర్‌బోర్డ్ డీజీఎం కార్తీక్‌రెడ్డి, మేనేజర్ కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కేసీఆర్ జన్మదినం

● బీఆర్ఎస్ నేతల ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు

● హాజరైన ఎమ్మెల్యే, ముఠాగోపాల్, మాజీ కార్పొరేటర్లు, పలువురు నేతలు



రాంనగర్‌లో జరిగిన బర్త్‌డే వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎమ్మెన్ శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి

ముషీరాబాద్ జోన్ బృందం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం, బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ జన్మదిన వేడుకలను ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాలలో ఆ పార్టీ నేతల ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. పలు డివిజన్‌లలో సేవా కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, కాలేరు వెంకటేష్, మాజీ కార్పొరేటర్లు, పలువురు నేతులు పాల్గొన్నారు. ఆయా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. పలు ప్రాంతాల్లో కేక్ కట్ చేశారు. ఫీవర్ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. రాంనగర్‌లో పేదలకు అల్పాహారం, పండ్లు, బాగ్‌లింగంపల్లిలోని కార్మిక శాఖ ప్రభుత్వ పాఠశాలలో వంద మంది విద్యార్థులకు షూలు పంపిణీ చేశారు. రాంనగర్‌లో పేద మహిళలకు చీరలను పంపిణీ చేశారు. బాగ్‌అంబర్‌పేట డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు చంద్రమోహన్ ఆధ్వర్యంలో, అడిక్‌మెట్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు బల్లా శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎం.నాగేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో, లంబాడీ తండాలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కల్యాణ్ నాయక్ ఆధ్వర్యంలో, బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య పార్కు వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో కేసీఆర్ జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని శ్రీలక్ష్మీగణపతి ఆలయంలో ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ ప్రత్యేక పూజలు చేశారు.

● మాజీ సీఎం కేసీఆర్ జన్మదినం సందర్భంగా కాచిగూడ లింగంపల్లి చౌరస్తా వద్ద డివిజన్ అభివృద్ధి కార్యాలయంలో బీఆర్ఎస్ డివిజన్ ఇన్‌చార్జి డాక్టర్ బద్దుల శిరీష, సీనియర్ నాయకుడు డాక్టర్ బద్దుల ఓంప్రకాష్ యాదవ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ కేక్ కట్ చేసి, అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. గోల్నాక కార్పొరేటర్ దూసరి లావణ్యశ్రీనివాస్‌గౌడ్ శంకర్‌నగర్‌లోని తన కార్యాలయంలో పార్టీశ్రేణులు, పారిశుధ్య కార్మికుల మధ్య కేక్ కట్ చేశారు. అంబేద్కర్‌నగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సమక్షంలో బాగ్‌అంబర్‌పేట మాజీ కార్పొరేటర్ కె.పద్మావతి డీపీ రెడ్డి కేక్‌ను కట్ చేశారు.

● ముషీరాబాద్‌లో మాజీ సీఎం కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు డి.శివముదిరాజ్, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీధర్‌రెడ్డి, ఆకుల అరుణ్ కుమార్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా 50 మంది రక్తదానం చేశారు.



అంబర్‌పేటలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, డాక్టర్ శిరీష ఓంప్రకాష్‌యాదవ్ తదితరులు

ఓబీసీ, ఎంబీసీ ఉద్యమాలకు ఆద్యుడు కర్పూరి ఠాకూర్ : వక్తలు



కర్పూరి ఠాకూర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న చెన్నారావు, భాగయ్య, విజయకుమార్ యాదవ్ తదితరులు

రాంనగర్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ఓబీసీ, ఎంబీసీ ఉద్యమాలకు ఆద్యుడు, భారత రత్న అవార్డు గ్రహీత, బిహార్ మాజీ సీఎం కర్పూర్ ఠాకూర్ అని పలువురు వక్తలు పేర్కొన్నారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జాతీయ వాయిద్య కళాకారుల సంఘం అధ్యక్షుడు ఎల్‌వీ.చెన్నారావు ఆధ్వర్యంలో కర్పూరి ఠాకూర్ వర్ధంతి సభ జరిగింది. ఈ సందర్భంగా చెన్నారావు మాట్లాడుతూ 1978లో ఓబీసీలకు, స్త్రీలకు రిజర్వేషన్లు కల్పించిన గొప్ప ధీశాల కర్పూరి ఠాకూర్ అని కొనియాడారు. ప్రొఫెసర్ భాగయ్య, విజయ్‌కుమార్‌యాదవ్, ఎస్‌వీకే కార్యదర్శి వినయ్‌కుమార్, ఎంబీసీ రాష్ట్ర అధ్యక్షుడు దుర్గారావు, ప్రముఖ సాహితీవేత్త రాపోలు సుదర్శన్, నాయకులు హనుమంతరావు, వేముల శ్రీనివాస్‌లు మాట్లాడుతూ ఠాకూర్ ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు.

బీసీల మనోభావాలను గౌరవించడమే: జాజుల

అంబర్‌పేట, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): బీసీల పోరాటాన్ని గౌరవించి కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ అసెంబ్లీలో సమగ్ర కుల గణనకు ఏకగ్రీవ తీర్మానం చేయడం బీసీల మనోభావాలను గౌరవించడమేనని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఇందుకు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం అంబర్‌పేట అలీకేఫ్ చౌరస్తాలో జ్యోతిరావు పూలే విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు.

కులగణన తీర్మానానికి చట్టబద్ధత కల్పించాలి

బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర అధ్యక్షుడు దాసు సురేష్

రాంనగర్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అసెంబ్లీలో చేసిన కులగణన తీర్మాణానికి చట్టబద్ధత కల్పించాలని, రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బీసీలకు 10 ఎంపీ సీట్లు ఇవ్వాలని బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర అధ్యక్షుడు దాసు సురేష్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని, పార్టీని డిమాండ్ చేశారు. శనివారం బాగ్‌లింగంపల్లిలోని బీసీ రాజ్యాధికార సమితి కేంద్ర కార్యాలయంలో అసెంబ్లీలో బీసీ కులగణన తీర్మానంపై బీసీ మేధావుల సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ఎంబీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్, సోషల్ జస్టిస్ జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ ప్రభంజన్‌యాదవ్, బీసీ ఉద్యమ నాయకులు జీవీఆర్.నారగోని, ఓబీసీ స్టూడెంట్ ఫోరం అధ్యక్షుడు అలూరి రామకృష్ణ, బీసీ సంఘం నాయకులు ఊర్మిళ, గోశిక స్వప్న బాల్‌రామ్, ఎల్లెం బాలకృష్ణ, కె.యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రముఖ సినీ గేయరచయిత సుద్దాల అశోక్‌తేజ

కళారూపాలను నిత్యం మెరుగుదిద్దుకోవాలి

ప్రముఖ సినీ గేయరచయిత సుద్దాల అశోక్‌తేజ

రాంనగర్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): కళారూపాలను నిత్యం మెరుగుదిద్దుకోవాల్సిన బాధ్యత ప్రతి కళాకారులకూ ఉంటుందని ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ అన్నారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ బాలోత్సవం చిన్నారుల కళాపండుగ సందడితో కొనసాగింది. తెలంగాణ బాలోత్సవం ప్రజాపాటకు నృత్య నీరాజనం వీనులవిందుగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ భారతదేశంలో 9 నృత్యాలు ఉన్నాయన్నారు. మణిపూర్, కథకళి, కూచిపూడి, భరతనాట్యం, మోహిని అట్టం, ఒడిస్సీ తదితర నృత్యాలు ఉన్నాయని, మనిషి పుట్టిన తర్వాతనే శాస్త్రాలు పుట్టాయని అన్నారు.

వీరసావర్కర్ విగ్రహం చుట్టూ ప్రహరీ నిర్మాణంపై

ఈఈ, డీఈలను నిలదీసిన కార్పొరేటర్

బర్కత్‌పుర, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు వీరసావర్కర్ విగ్రహం చుట్టూ ప్రహరీ నిర్మించి మెట్లు ఏర్పాటు చేయాలని జీహెచ్ఎంసీ కమిసనర్, జోనల్ కమిషనర్లు ఈఈ, డీఈలను ఆదేశించినా వారు నిర్లక్ష్యంగా వ్యహరించారు. దీంతో కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమాదేవి, బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, నాయకులు సుభాష్‌పటేల్, భీమ్‌రాజ్‌లు డీఈ రఘును శనివారం నిలదీశారు. నింబోలిఅడ్డ ఏకే.భవన్ వీధిలో జరిగిన ఓ కార్యక్రమానికి వచ్చిన డీఈ రఘును వారు కలిసి ఈ నెల 26న వీరసావర్కర్ వర్ధంతి ఉందని, అప్పటి లోపు విగ్రహం చుట్టూ ప్రహరీ, మెట్లు నిర్మించాలని కోరారు. డీఈ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో నిలదీశారు. వెంటనే పనులు చేపట్టకపోతే జోనల్ కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

బసవేశ్వరుడికి 'సాంస్కృతిక సారథి బిరుదు'

హర్షణీయం: వక్తలు



ట్యాంక్‌బండ్‌పై బసవేశ్వరుడి విగ్రహానికి పూజ చేస్తున్న ఎంపీ బీబీపాటిల్, మాజీ ఎంపీ సురేష్ షెట్కార్, మాడపు వీరమల్లేష్

కవాడిగూడ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): తమ ఆరాధ్యదైవమైన బసవేశ్వరుడికి కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం సాంస్కృతిక సారథి బిరుదు ప్రదానం చేస్తూ మంత్రి వర్గ తీర్మానం చేయడం అభినందయనీమని రాష్ట్రమంత్రి, జిల్లా ఇన్‌చార్జి పొన్నం ప్రభాకర్ అన్నారు. కర్ణాటకలో ఉన్న వీరశైవ లింగాయత్‌లకు న్యాయంచేసేందుకు అక్కడి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హర్షణీయమన్నారు. ఈ మేరకు శనివారం ట్యాంక్‌బండ్‌పై ఉన్న బసవేశ్వరుడి విగ్రహం వద్ద తెలంగాణ వీరశైవ లింగాయత్ ఫెడరేషన్ సికింద్రాబాద్ అధ్యక్షుడు మాడపు వీరమల్లేష్, ప్రధాన కార్యదర్శి కోట గుండప్ప, వీరశైవ సేవాదళ్, లింగాయత్ మహాసభ, యువ రాష్ట్రీయ బసవదళ్, సమస్త లింగాయత్ సమాజ్ సంయుక్త ఆధ్వర్యంలో అభినందన సభ, సంబరాల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి పొన్నం ప్రభాకర్, జహీరాబాద్ ఎంపీ బీబీపాటిల్, మాజీ ఎంపీ సురేష్ షట్కార్, తెలంగాణ వీరశైవ లింగాయత్ ఫెడరేషన్ వైస్‌చైర్మన్ మాడపు వీరమల్లేష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శాశ్వత ప్రాతిపదికన సీసీ రోడ్లు : ఎమ్మెల్యే కాలేరు

బర్కత్‌పుర, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట నియోజకవర్గం పరిధిలోని అయిదు మున్సిపల్ డివిజన్లలో డ్రైనేజీ, మంచినీటి పైప్‌లైన్ల నిర్మాణం తర్వాత శాశ్వత ప్రాతిపదికన సీసీ రోడ్లు నిర్మిస్తున్నట్లు స్థానిక ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. శనివారం కాచిగూడ డివిజన్ ఏకె.భవన్ వీధిలో రూ.24 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను స్థానిక కార్పొరేటర్ కన్నె ఉమాదేవితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా బస్తీలలో పాదయాత్ర నిర్వహించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మంచినీరు, డ్రైనేజీ సమస్య ఎదుర్కొంటున్నామని స్థానిక ప్రజలు ఎమ్మెల్యేకు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మంచినీటి ఎద్దడి తలెత్తకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, బీఆర్ఎస్ కాచిగూడ డివిజన్ అధ్యక్షుడు ఎర్ర భీష్మాదేవ్, ఇన్‌చార్జి డాక్టర్ బద్దుల శిరీష, సీనియర్ నాయకులు డాక్టర్ ఓంప్రకాష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు చైన్‌స్నాచర్ల అరెస్ట్.. పరారీలో మరో నిందితుడు

కవాడిగూడ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు చైన్‌స్నాచర్లను శనివారం రిమాండ్‌కు తరలించారు. గాంధీనగర్ సీఐ ఎం.వరప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం... తుకారంగేట్ నివాసి అల్లం అనిరుధ్(21), మల్కాజ్‌గిరికి చెందిన ఎస్.బాబుఅక్షయ్(24), వీరిద్దరూ ఈనెల 14న కవాడిగూడలోని సీజీవో టవర్స్ మలుపు వద్ద బైక్‌పై వెళ్తూ యాక్టీవాపై వెళ్లే వ్యక్తి నుంచి ఒక మొబైల్ ఫోన్, మనీపర్సు లాక్కున్నారు. మరో వ్యక్తికి పర్సును న్యూబోయిగూడ వద్ద ఇచ్చారు. శనివారం ఉదయం బన్సీలాల్‌పేట్ కమాన్‌లో వాహనాలను తనిఖీ చేస్తుండగా అనిరుధ్, బాబుఅక్షయ్‌లను రిమాండ్‌కు తరలించామని, మరో నిందితుడు పరారీలో ఉన్నట్లు తెలిపారు.



రాజ్యసభ సభ్యుడిగా నామినేట్ అయిన అనిల్‌కుమార్‌యాదవ్‌ను సన్మానిస్తున్న కాంగ్రెస్ నేతలు వరదరాజు, సురేష్, ప్రసాద్ తదితరులు

ప్రతి కార్యకర్తకూ కాంగ్రెస్‌లో గుర్తింపు

● ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్

రాంనగర్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): అంకితభావంతో పనిచేసే ప్రతి కార్యకర్తకూ కాంగ్రెస్ పార్టీలో గుర్తింపు లభిస్తుందనడానికి తానే నిదర్శనం అని రాజ్యసభ సభ్యుడుగా నామినేట్ అయిన ఎం.అనిల్‌కుమార్ యాదవ్ అన్నారు. ఆయనను శనివారం కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ జిల్లా కమిటీ ఉపాధ్యక్షుడు వరదరాజు, సికింద్రాబాద్ జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు సురేష్, ముషీరాబాద్ నియోజకవర్గం సేవాదళ్ అధ్యక్షుడు ప్రసాద్, పార్టీ నాయకుడు రామకృష్ణ, జె.కృష్ణలు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం ఖాయం

ముషీరాబాద్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఈ సారి పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ అత్యధిక స్థానాలు సాధించి, కేంద్రంలో అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ నుంచి రాజ్యసభకు ఎన్నికైన ఎం.అనిల్ కుమార్ యాదవ్ ధీమా వ్యక్తం చేశారు. అనిల్‌కుమార్ యాదవ్‌ను శనివారం గ్రేటర్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు లింగంగుప్తా, ముషీరాబాద్ డివిజన్ కాంగ్రెస్ కార్యదర్శి రామకృష్ణ సన్మానించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ ఆర్.కృష్ణయ్య

విద్యుత్ సంస్థల్లో డైరెక్టర్ల వయో పరిమితిని

65 ఏళ్లకు పెంచాలి: ఆర్.కృష్ణయ్య

బర్కత్‌పుర, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ట్రాన్స్‌కో, జెన్‌కో ఎస్‌టీబీసీఎల్, ఎన్‌పీబీసీఎల్ తదితర విద్యుత్ సంస్థలలో డైరెక్టర్ల వయో పరిమితిని 65 ఏళ్లకు పెంచాలని ఎంపీ ఆర్.కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 50 శాతం డైరెక్టర్ పోస్టులను బీసీలకే కేటాయించాలని డిమాండ్ చేశారు. శనివారం కాచిగూడ అభినందన్ గ్రాండ్ హోటల్‌లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ ఆధ్వర్యంలో విద్యుత్ ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ గత ప్రభుత్వం ఉద్యోగుల రిటైర్డ్‌మెంట్ వయసు 61 ఏళ్లకు పెంచిందని, దీనిలో భాగంగా డైరెక్టర్ల వయో పరిమితిని కూడా 62 నుంచి 65 ఏళ్లకు పెంచి, విద్యుత్ ఉద్యోగులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో తెలంగాణ విద్యుత్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.కుమారస్వామి, ప్రధాన కార్యదర్శి ముత్తం వెంకన్నగౌడ్, విద్యుత్ ఓసీ సంఘం అధ్యక్షుడు ఆర్.సుధాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సి.భానుప్రకాష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఓయూ గేట్ వద్ద సిరిపురం యాదయ్య

విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి

రాంనగర్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమంలో ఆత్మబలిదానం చేసుకున్న సిరిపురం యాదయ్య విగ్రహాన్ని ఓయూ గేట్ వద్ద ఏర్పాటు చేయాలని రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఆయన స్మారక సంస్థ చైర్మన్ ప్రొఫెసర్ వెంకట్రామయ్య ఆధ్వర్యంలో శనివారం ఓయూ గేట్ వద్ద నిరసన కార్యక్రమం చేసి, సిరిపురం యాదయ్య వర్ధంతి పోస్టర్ ఆవిష్కరించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ ఈనెల 20న సిరిపురం యాదయ్య వర్ధంతి కార్యక్రమం జరుగుతుందన్నారు.



సక్సెస్ మీట్‌లో నారాయణ కళాశాల విద్యార్థులు, డీన్స్, అధ్యాపకులు

జేఈఈ మెయిన్స్‌లో 'నారాయణ' హవా

● 99.9 పర్సెంటేజీ సాధించిన పది మంది విద్యార్థులు

నల్లకుంట, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): నారాయణ కళాశాల విద్యార్థులు జేఈఈ మెయిన్స్ జనవరి సెషన్స్‌లో రాణించారు. ఈ సందర్భంగా శనివారం నల్లకుంటలోని కొండలరావు ప్రాంగణంలో నారాయణ కళాశాల విద్యార్థుల సక్సెస్ మీట్ నిర్వహించారు. నారాయణగూడ డివిజన్ పరిధిలోని నారాయణ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు జేఈఈ మెయిన్స్ జనవరి సెషన్స్‌లో మంచి ప్రతిభ కనబరిచారు. జేఈఈ మెయిన్స్‌లో పది డిఫరెంట్ సెషన్స్‌లో పరీక్షలు రాసిన విద్యార్థులు మంచి పర్సెంటేజ్‌లను సాధించారు. కోర్ డీన్ మహ్మద్ హబీబ్, డీన్ శ్రీనివాసరెడ్డిల ఆధ్వర్యంలో 99.9 పర్సెంటేజీ సాధించిన పది మంది విద్యార్థులు, 99 లోపు పర్సెంటేజీ సాధించిన 47 మంది విద్యార్థులను ప్రతి ఒక్కరినీ ఈ సక్సెస్ మీట్‌లో అధ్యాపకులు, అకాడమిక్ హెడ్ పవన్‌కుమార్‌శర్మ, ఏజీఈఎం మల్లారెడ్డి, డీజీఎం లక్ష్మారెడ్డి, సీనియర్ అకాడమిషయన్ కొండలరావు తదితరులు అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నారాయణగూడ డివిజన్ పరిధిలో ఇతర పోటీదారులు తమ దరిదాపుల్లో కూడా లేరన్నారు.

అమరావతి రాజధాని మార్పు..

వైఎస్.జగన్ పతనానికి నాంది : చిన్నయ్య దొర

బర్కత్‌పుర, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఏపీ రాజధాని అమరావతి మార్పు, మూడు రాజధానులు ఏర్పాటు చేయడం తదితర విధానాలే వచ్చే ఎన్నికల్లో వైఎస్.జగన్ ప్రభుత్వ పతనానికి నాంది పలుకనున్నాయని ఉమ్మడి ఏపీ మున్సిపల్ కౌన్సిల్ చాంబర్ మాజీ చైర్మన్ గొరకపూడి చిన్నయ్య దొర తెలిపారు. శనివారం బషీర్‌బాగ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏపీలోని అన్ని వర్గాల ప్రజలు వైఎస్.జగన్ పాలనను పూర్తిగా వ్యతిరేకిస్తున్నారని స్పష్టం చేశారు. ఎన్నికల్లో జగన్‌కు గుణపాఠం చెప్పడానికి ప్రజలు సిద్ధగా ఉన్నారని అన్నారు. బీజేపీ, టీడీపీ, జనసేన కూటమిల జైత్రయాత్రను ఏ శక్తులూ అడ్డుకోలేవని 140 అసెంబ్లీ సీట్లు వస్తాయని ధీమా వ్యక్తం చేశారు.

ఏసీపీకి అభినందన



ఏసీపీని అభినందిస్తున్న వెంకటరావు, జయేందర్‌బాబు

చిక్కడపల్లి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లి ఏసీపీగా పదవీబాధ్యతలు స్వీకరించిన ఎల్ రమేష్‌కుమార్‌ను కాంగ్రెస్ నాయకులు, న్యాయవాది వెంకటరావు, జి.జయేందర్‌బాబు, శిశుకుమార్‌లు అభినందించారు. శనివారం ఏసీపీని కలిసి, ఆయనను సన్మానించారు.

● ప్రారంభం







హైదరాబాద్‌లోని హైటెక్ సిటీలో యూజెనిక్స్ హెయిర్ సైన్సెస్ కొత్త శాఖ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న క్రికెటర్ మహ్మద్ షమీ, మాజీ క్రికెటర్ అజారుద్దీన్, పింకిరెడ్డి, హాలీవుడ్ నటీ అలెగ్జాండ్రియా టైలర్.